
నూరేళ్ళ తెలుగు కథకు

నవ్య నీరాజనం - 70

నూరేళ్ళ తెలుగు కథకు



# సాహిత్యం సమాజం నుంచి వచ్చిన సమష్టి కృషి

## - జయంతి పాపారావు

'పులి క్రూర జంతువంటారు. సింహం పులి కంటే క్రూరమైనదంటారు. అయితే ఆ రెండు కూడా మన పెట్టుబడీదారి ప్రజాస్వామ్యం కంటే క్రూరమైనవి కావు. సాహిత్యం క్రూర జంతువులను వేటాడాలి' అంటారు ప్రముఖ కథా రచయిత, వ్యాసకర్త, విమర్శకుడు జయంతి పాపారావు. 'సాహిత్యానికి సమాజాన్ని ఉన్నతీకరించే శక్తి ఉండాలి. రచయిత ప్రజల పక్షాన నిలిచి వారికి మార్గదర్శకునిగా నిలవాలి' అంటున్న జయంతి పాపారావుతో ఈ వారం ఇంటర్వ్యూ

## బాల్యం బాధలమయం


కుటుంబ సభ్యులతో...

1938లో విశాఖ జిల్లా నర్సీపట్నం తాలూకాలోని సీతన్నఅగ్రహారంలో సత్యనారాయణ వెంకటరత్నం దంపతులకు మూడో సంతానంగా పుట్టాను. తరతరాలుగా వ్యవసాయమే వృత్తి. నాన్నగారు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు. బాల్యం బాధలతోనే గడిచినా ఏ బాధల్ని బాధలుగా, ఏ కష్టాల్నీ కష్టాలుగా ఎప్పుడూ అనుకోలేదు. ఆత్మవిశ్వాసం నిజాయితీ, ఇవే నా జీవితాన్ని బాల్యం నుండి నడుపుతున్నాయి. నేనెప్పుడూ బతుకు పోరాటంలో ఓడిపోలేదు. అవకాశవాదిగా మారి పోలేదు. మా నాన్నగారిది గాంధీ మార్గం. కుల నిర్మూలన కోసం ఆయన చేసిన కృషి నన్ను బాల్యంలోనే బాగా ప్రభావితుణ్ణి చేసింది. నా పిల్లల్ని మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపయోగపడింది.

## గురజాడ అడుగుజాడ

స్కూల్ ఫైనల్ నుంచీ ఎమ్మే ఎకనమిక్స్ దాకా చదువు ఆర్థిక ఇబ్బందులతోనే సాగింది. నా పదహారో ఏట మహాభారతాన్ని సంపూర్ణంగా చదివాను. అప్పుడే నాకు భక్తి కంటే సాహిత్యం పట్ల అభిమానం కలిగింది. ప్రాచీన సాహిత్యంతో బాటు ఆధునిక సాహిత్యంలో గురజాడను చదువుతూ వచ్చాను. 'నేను కూడా ఎందుకు రాయకూడదు? ఎందుకు రాయలేను?' అన్న ఆలోచన వచ్చింది. 1956లో రాయడం మొదలు పెట్టాను. గ్రామీణ జీవితంతో నాకున్న పరిచయం, ముప్పై గ్రామాల ప్రజల మీద మూడు కుటుంబాల ఆస్తిపరులు పెత్తనం చెలాయించడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆలోచింప జేసింది. ఆ సామాజిక విశ్లేషణే నాకు కథా వస్తువైంది.

## తొలి కథ

నా తొలి కథ పేరు 'పిరికివాడు'. ఇది 1957లో అచ్చయింది. అప్పటికి నేను విశాఖపట్నంలోని కలెక్టరు కార్యాలయంలో పని చేస్తున్నాను. ఆ కథను చదివి ప్రముఖ రచయిత రా.వి. శాస్త్రి ఆఫీసుకు వచ్చి నన్ను ప్రత్యేకించి అభినందించారు. అప్పట్నించీ రాస్తూనే ఉన్నాను. ఏం రాసినా బ్రాహ్మీముహూర్తంలోనే రాస్తాను. ఆ ప్రభాతవేళ నాలో కలిగే సృజనాత్మకమైన ఆలోచనలను కాగితాల మీద నిక్షిప్తం చేస్తాను. చదవాలన్నా ప్రత్యూష సమయాన్నే ఎంచుకుంటాను. ఇటు మన సాహిత్యం, అటు ఇతర భాషల్లోని సాహిత్యం చదువుతూ అధ్యయనానికి ఎక్కువ సమయం కేటాయించాను. ఇతర ప్రాంతాల, దేశాల సాహిత్య పఠనం వల్ల మనం ఎంత వెనుకబడి ఉన్నామో తెలుసుకోగలుగుతాం. మన దిశా నిర్దేశానికి కూడా ఆ సాహిత్యం దోహదపడుతుంది.

## ప్రముఖుల పరిచయాల ప్రభావం

1957లో రాచకొండ విశ్వనాథశాస్త్రి, గణపతిరాజు అచ్యుతరామరాజు మరికొంతమందితో పరిచయాలు ఏర్పడ్డాయి. అనంతరం చాగంటి సోమయాజులు, కాళీపట్నం రామారావు, బలివాడ కాంతారావు తదితరులతో కూడా పరిచయం ఏర్పడింది. శ్రీరంగం శ్రీనివాసరావు, కొడవటిగంటి కుటుంబరావులను కలుసుకుంటున్నా పరిచయం మాత్రం అంతంత మాత్రమే! అయినా వీరి ప్రభావం నా మీద బాగానే ఉంది. అయితే వ్యక్తిత్వ విలువలు కాపాడుకోవాలన్నది కూడా నా ప్రగాఢ విశ్వాసం. 1968 ప్రాంతాల్లో ముందుకు వచ్చిన యువ రచయితలు చాలా మంది తెలుసు. వాళ్ళతో రోజూ ఎక్కడో ఒకచోట సాహితీ చర్చలు జరుగుతుండేవి. నన్నొక విషయం ఎప్పుడూ బాధిస్తూ ఉండేది. కష్టపడి జీవించే జన సామాన్యంలో ఉన్న కనీస విలువలు కూడా చాలామంది రచయిత(త్రు)లలో నాకు కనిపించలేదు. ప్రగతిశీల విప్లవ సాహిత్యాల్లో పాఠకుల నుంచి, సంస్థల నుంచి ప్రోత్సాహం పొంది, పేరు సంపాదించుకుని, తరువాత చాలా మంది రచయితలు అవకాశవాదులు గానూ రాజ్య రచయితలుగాను మారిపోయారు. ఇది నన్ను అప్పట్లో చాలా బాధించింది.


శ్రీమతి లలితతో...

## ఏ సంస్థలోనూ సభ్యత్వం లేదు

సాహిత్యం సమాజ సృష్టి. సమష్టి సృష్టి. ఎందరెందరో రచయితలు నిరంతరం సాహిత్యాన్ని చినుకుల్లా కురిపిస్తూ, వర్షంలా వర్షిస్తూ, పాయలుగా ప్రవహింప చేస్తున్నారు. ఈ పాయలన్నీ మహాప్రవాహమై సాహితీ సాగరాన్ని సృష్టించాలి. ఏ కొద్దిమందో రాయడం వల్ల అది సాధ్యపడదు. గొప్ప రచయితలు, ప్రముఖ రచయితలు, అంతర్జాతీయ స్థాయి రచయితలు ఇలా వర్గీకరణతో నేను చూడలేను. మంచి రచ

యితలు మాత్రమే సమాజాన్ని మార్చగలరు. అందుకే ఎన్నో సాహితీ సంస్థలు ఆవిర్భవించినా నాకు వీలుకాక ఏ సంస్థలోనూ నేను సభ్యునిగా చేరలేదు.

### ప్రజల పక్షాన నిలబడి రాస్తున్నాను

నేను నా శక్తిమేరకు, నాకు తెలిసినంతవరకు ప్రజల పక్షాన నిలబడి నిజమైన ప్రజాస్వామ్యం కోసం రాస్తున్నాను. ప్రజా జీవితంలో అవినీతి, దోపిడీ, హింస, నేరం, వివక్ష, అణచివేత, ఎన్నో దుర్మార్గాలు, ఎన్నో అన్యాయాలు వ్యవస్థీకృతం అయిపోయాయి. ప్రజలు, నిజమైన ప్రజా ఉద్యమాలు మాత్రమే వ్యవస్థను వాటి నుంచి విముక్తి చేయగలవు. ఆ దిశలో సాహిత్య రచన చేయాలన్నదే తొలి నుంచీ నా తపన. ఈ వయసులోనూ ఆ మార్గంలోనే నా రచనలు కొనసాగుతున్నాయి.

### అవార్డులు - రివార్డులు

నాకు పురస్కారాల పట్ల ఆసక్తీ లేదు విశ్వాసం లేదు. పురస్కారాలు స్వీకరించడమంటే ఆ సాహిత్యాన్ని ఆ విలువల్ని రాజ్య, రాజ్యేతర దోపిడీ శక్తులకు అమ్ముకోవడమో, తాకట్టు పెట్టడమో అవుతుందని నా అభి ప్రాయం. అది అవకాశవాదం, ద్వంద్వనీతి. అందుకే వాటికి ఎప్పుడూ దూరంగా ఉంటాను. నా రచనలపై రమావత్ కుసుమకుమారి అనే ఆమె పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథం రాసింది. ఇది నాకొక ప్రశంసగా భావిస్తాను. అంతే!

### నవల ఒక్కటే

ఎన్నో కథలు, వ్యాసాలు, పరిచయ విశ్లేషణాత్మక గ్రంథాలు రాసినా నవల మాత్రం ఒక్కటే రాసాను. నవల విస్తృతి ఎక్కువ. రాయడానికి కావాల్సిన విషయం ఉన్నా, అక్షరీకరించడానికి ఎక్కువ సమయం కావాలి. ప్రచురణ కర్తగా కూడా బాధ్యతల్ని స్వీకరించాను కాబట్టి సమయం చాలక నవలలు రాయలేకపోయాను. 'వెతుకుతూ... వెంటాడుతూ... వేటాడుతూ' నవలకు నా ఉద్యోగంలో అనుభవాలు, జీవితాధ్యయనం నన్ను ప్రేరేపించాయి. రాష్ట్ర ప్రభుత్వంలో పని చేస్తూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగంలోకి వెళ్లాను. ఢిల్లీలోని మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్ ప్రధాన కార్యాలయంలో కొన్నాళ్ళు పనిచేశాను. ప్రభుత్వరంగ పారిశ్రామిక సంస్థల్లో కూడా పని చేశాను. అవినీతి, దోపిడీ ఎందుకు ఏ విధంగా జరుగుతున్నాయో అవగాహన ఏర్పడింది. అవినీతి అనైతికచర్య మాత్రమే కాదు. ఇప్పుడు అది ప్రజల్ని, ప్రజాధనాన్ని దోచుకునే దోపిడీగా ప్రబలమై పోయింది. ముఠా దోపిడీగా మారిపోయింది. జీవితంలోనూ, వ్యవస్థలోనూ ఒక భాగంగా పాతుకుపోయింది. ఇది ప్రజాస్వామ్యానికి చాలా హానికరమైనదిగా భావించి, దీన్నంతా క్లుప్తంగా ఆవిష్కరించడానికి ఈ నవల రాశాను. 2002లో వచ్చిన ఈ నవల రావిశాస్త్రి అభిమానుల అభినందనలను అందుకుంది. నేను చెప్పాలనుకున్నది, చెప్పింది పాఠకులకు అందించగలిగానన్న నమ్మకం కలిగింది.

### ఇతర భాషల్లోకి అనువాదం

కొన్నికథలు హిందీలోకి అనువాదం అయ్యాయి. హిందీ పత్రికల్లో అచ్చయ్యాయి. నవల కూడా హిందీలోకి అనువాదం అయింది. ప్రస్తుతం నా నవలను నేనే ఆంగ్లంలోకి అనువదిస్తున్నాను. వీటి మీద కూడా సిద్ధాంత గ్రంథాల కోసం పరిశోధనలు జరుగుతున్నాయి. ప్రచురణకర్తగా నా కథల సంపుటాలు. వ్యాస సంపుటాలతో పాటు 'నూరేళ్ల - నూరుగురు కథకులు - నూరు కథానికలు' అన్న శతజయంతి సంకలనాన్ని ఇటీవలే వెలువరించాను. ఈ పద్ధతిలో భారతీయ భాషల్లో వచ్చిన తొలి సంకలనం ఇది. ఈ ప్రయత్నాన్ని 'లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సులో చోటు చేసుకునేందుకై చర్య తీసుకోవాలని కొందరు అంటున్నారు. ఆ పని కూడా నాకే వదిలేయకుండా ఎవరైనా పూనుకుంటే తెలుగు కథానిక గౌరవ ప్రతిష్ఠలు పెరుగుతాయి. త్వరలో నా 'నాలుగో కథా సంపుటి', 'కథానికా ప్రస్థానం - పరిణామ దర్శనం (1910-2009)' 'శత జయంతి అధ్యయనం', 'కథానిక - పరిణామం' రాబోతున్నాయి.

### నచ్చినవి

| | | |
|---|---|---|
| సినిమా | : | పథేర్ పాంచాలి |
| సినీ దర్శకుడు | : | సత్యజిత్‌రే |
| సినీ హీరో | : | ఉత్తమ్‌కుమార్ (దో ఆంఖే బారాహాత్) |
| సినీ హీరోయిన్ | : | స్మితాపాటిల్ |
| రచయిత | : | రావి శాస్త్రి |
| నవల | : | మూడు కథల బంగారం |
| వంట | : | శాకాహారం |
| స్నేహితులు | : | డాక్టర్ నూరపనేని శేషారత్నం<br>ముల్లంగి వేంకట రమణారెడ్డి |
| పని | : | వ్యవసాయం |
| జీవన సరళి | : | ఇతరులుకూ సమాజానికి హాని కలగకుండా కష్టపడి సంపాదించుకుని జీవించే దోపిడీ రహిత శ్రమ జీవన విధానం |

### ఇప్పుడొస్తున్న రచనలు

ప్రగతిశీల విప్లవ సాహిత్యాల్లో స్పష్టమైన దిశా నిర్దేశం ఉంది. ఇప్పుడు ప్రజల మధ్య అనైక్యత, ద్వేషం సృష్టించే సాహిత్యం కొంత వస్తోంది. కులం, మతం ప్రాంతీయ విభేదాలతో వస్తున్న కొన్ని రచనలు ప్రజల మధ్య చీలికలు తెచ్చి గందరగోళం సృష్టిస్తున్నాయి. ఈ సాహిత్యం రాజ్య, రాజ్యేతర దోపిడీ శక్తులకే ఉపయోగపడుతుంది. సమస్త పీడిత ప్రజల సంక్షేమాన్ని కాకుండా ఎవరి మటుకు వారి 'కొందరి' బాగునే కోరుకునే రచనలు ప్రజాసాహిత్యాలు కావు. అవి రాజ్య సాహిత్యాలు మాత్రమే! ఈ వాస్తవాన్ని ప్రజలు, పాఠకులు గుర్తించి ఈ చీలిక వాద సాహిత్యాన్ని గతంలో తిరస్కరించిన సందర్భాలున్నాయి. ఇప్పుడు మళ్లీ ఆ సాహితీ విప్లవం, తిరుగుబాటు ఉద్యమం అవసరమనిపిస్తోంది.

### వర్ధమాన రచయితల కోసం

సాహిత్యం రాజకీయాలకు దూరంగా ఎప్పుడూ లేదనీ, ఉండదనీ నా విశ్వాసం అభిప్రాయం. నేటి యువత తమ రచనలను రాజకీయశక్తిగా, ఉద్యమశక్తిగా అభివృద్ధి చేసుకోవాలి. శైలి ఎటువంటిదైనా రాసే వస్తువుపై పూర్తి అవగాహన ఉండాలి. సంభాషణలు పాత్రోచితంగా ఉండేందుకు మాండలికం అవసరమే! కథాగమనం మాత్రం అందరికీ అర్థమయ్యే దైనందిన వాడుక భాషలో సాగాలి.

### నిరాడంబర జీవితం

గత పన్నెండేళ్ల నుంచి, సరాసరిన నెలకు మూడు వేల రూపాయలతో పేద కూలీల పిల్లలను చదివిస్తున్నారు. అందుకోసం సొంత ఖర్చులు తగ్గించుకుని నిరాడంబర జీవితం గడుపుతున్నాను. 1961లో లలితతో వివాహం అయింది. ముగ్గురు కొడుకులు, అయిదుగురు మనవరాళ్లు. కొడుకులు కోడళ్లు స్వయంకృషితో ఉన్నత విద్య చదివి మంచి ఉద్యోగాలు చేస్తున్నారు.

-మేడా మస్తాన్‌రెడ్డి
94413 44365

నాకు నచ్చిన నా కథ

# అన్నీ ఒక చోటే

- జయంతి పాపారావు

'సీపుర్లు... సీపుర్లు...'

'సీపిర్లండి... సీపిర్లండి...'

'ఒద్దొమ్మా! ఒద్దొద్దు!'


'సవగ్గా ఇత్తా, కొనమ్మా!'

'చెయి ఖాళీ లేదు!'

'అనక రానేటి?'

'ఒద్దమ్మా! ఒద్దొద్దు!'

'ఏటోచ్చిందేటి! ఒవుల్లూ కొంటంనేదు! మావ్ సవగ్గా ఇస్తున్నా ఒద్దంతన్నారు.... పుంజీడు రాచ్చసబజార్లో చ్చేసి వూరు వూరంతా ఆక్కరమిచ్చీసుగున్నారంత... ఎక్కడ విన్నా వొకిటేగోల... మావెల బతకాల? సెప్పుతల్లీ, సెప్పు! కాళ్లరిగిపోయేలా కాలనీ అంతా తిరిగి నాను.. ఒవుల్లూ కొన్నేదు... ఇదివరక అరగంటలో ఆరుసీపుర్లు అమ్మే దాన్ని! మీరూ వలగంతె ఎలగమ్మా!? ఇంత తిరిగినా బోణీనేదు తల్లీ, నువ్వన్నా కొనమ్మా, సవగ్గాఇత్తాను! ఆరేళ్ళకాణ్ణుంచి నాకాడే కొంతన్నారు. తల్లీ నువ్వు కొనమ్మా, కొను! నీకు పున్నెముంటాది... ఈ మద్దికాలంల నాకాడ కొనడం మానేశారమ్మా... ఇయ్యాలన్నా తీసుకో, తల్లీ!'



'లేదమ్మా లేదు! ఒద్దమ్మా ఒద్దు! ఇంట్లో చీపుర్లు చాలా వున్నాయ్! ఏం చేసుకోవాలి?! అవసరం లేదమ్మా! మాట్టాడానికి కూడా తీరిక లేదు!'

'మా వెలగ బతకాల!'

'అది నాకు తెలీదమ్మా! ఎవరి సుఖం వాళ్లు చూసుకుంటారు! ఎవరిబాగు వాళ్లే చూసుకుంటారు! అంతేనమ్మా, అంతే!'

'ఆరేళ్ల కాణ్ణుంచి నాకాడే కొంతన్నారు! అభిమానం ఉండొద్దా?!'

'బజార్లో అన్నీ దొరుకుతున్నాయ్.... రాక్షస బజార్లో అన్నీ ఒకచోటే దొరుకు తున్నాయ్... ఎక్కడ వెదికినా, ఏ గుండెల్లో వెదికినా దొరకనివి ప్రేమాభిమానాలే!'

'ఎల్లిపొమ్మంతారా!'

'వెళ్లమ్మా, వెళ్లు'.

***

'కొబ్బరికాయలోయ్... కొబ్బరికాయలోయ్... అమ్మగోరా! కొబ్బరి కాయలు...'

'ఒద్దు తల్లీ, ఒద్దు! ఇంట్లో వున్నాయ్! ఇప్పుడవసరం లేదు'.

'ఓరానికి పదికాయలైనా ఇదివరక నాకాడ కొంతన్నారు... నాకాడే మూడేళ్ల కాణ్ణుంచీ కొంతన్నారు... ఇప్పుడు కాదంటే ఎల్లవుద్ది? కొనమ్మా, కొను ముదారకాయలు, కొట్టి సూడండి; సెంద్రుణ్ణి సూచినట్టుంతాది; దేవుడికి కొడితే, దేవుడే సేతులు సాచి బేగివ్వమంతాడు! పదికాయలివ్వనా, ఏటి ఎన్నివ్వమంతారేటి?

'ఒద్దమ్మా, ఒద్దు! కాయలున్నాయని చెప్పాను కదా! ఇలా మాట్లాడుతూ కూచుంటే, నాకు ఇంట్లో పనులవ్వవు కదమ్మా!'



'నీసేత్తో బోణీ కొడితే, తట్టెడు కాయలూ బేగిసిటంలో సెల్లిపోతాయి! వందుకే గదమ్మా, నిన్నొగ్గడం నేదు. బేగి రండి; పదికాయలట్టుకొని బేగెల్లి పోండి? నాను నోరిప్పకుండా సిటంలో ఎల్లిపోతా, తల్లీ! రా తల్లీ, బేగిరా!'

'ఒద్దని చెప్పానుకదమ్మా, ఒద్దమ్మా ఒద్దు!'

'నాకు తెల్దేటి, నువ్ రాచ్చసబజార్ల కొంతన్నావ్! వందుకే నన్ను తవిలేస్తున్నావ్!'

'నువ్ చెప్పింది నిజమే! ఏం చేయమంటావ్?!'

'మాకాడే కొనాల! వంతే కదా!'

'అది కుదరదు. నేనే కాదు, అందరూ కూడా అక్కడే కొంటున్నారు. మన విశాఖపట్నంలో రోజుకి కనీసం పది వేలమందికి తక్కువ కాకుండా రాక్షస షాపుల్లోనే కొంటున్నారట అన్నీ ఒకచోటే దొరుకుతాయి కదా! ఆ సదుపాయాన్ని ఎవరు కాదంటారు?! ఎవరి సదుపాయం వాళ్లు చూసుకుంటారు. ఎవరి సుఖం వాళ్లు చూసుకుంటారు. ఎవరి లాభం వాళ్లు చూసుకుంటారు.... కాదంటే మానేస్తారా?'

'మా వెలగ బతకాల?'

'నిజమే! నువ్ చెప్పింది. నిజమే. వీధికో సారా దుకాణం పెట్టేసి తాగొద్దంటే మానేస్తారా? వీధికో దొంగ సారా దుకాణం నడుస్తుంటే, దొంగసారా తాగొద్దంటే మానేస్తారా! కాలనీకో ముండల కంపెనీ, అది కూడా సంసార కుటుంబాలు నివసించే కాలనీల్లో నడుస్తుంటే, మానేయ మంటే మానేస్తారా? నగ్నన్రుత్యాలు రాత్రీ పగలు కూడా నడుస్తుంటే, చూడొద్దంటే మానేస్తారా? చుట్టా, బీడీ, సిగరెట్లు, నల్లమందు ఖైనీ, వయాగ్రా వంటివి మంచివి కావని చెప్తేవింటారా? అటువంటివన్నీ లేకుండా, రాకుండా చూడాలి! అప్పుడే మానేస్తారు! అవి దొరుకుతున్నంత కాలం ఎవరినైన మానేయమంటే మానేస్తారా? రాక్షసబజార్లు కూడా అంతే! దేని ఆకర్షణ దానికుంటుంది! అవి వచ్చాక, అక్కడికెళ్లొద్దంటే ఎవరు మానేస్తారు! నీ బతుకు తెరువు గురించి ఎవరూ ఆలోచించరు కదమ్మా! అవి రాకుండా, లేకుండా చూడాలి! నీ పొట్ట ఎవరు కొడుతున్నారో, వాళ్లనే నువ్ అడగాలి! నన్నడిగితే నేనేమి చెప్పగలను?'

'ఎల్లిపోమ్మంతరా?'

'మంచిదమ్మా, వెళ్లు'

***

అరటికాయలు.... ఆనబకాయలు... ఉల్లిపాయలు... వంకాయలు... అల్లం... పచ్చిమిరపకాయలు... ఆక్కూరలు... దొండకాయలు.. బెండకాయలు.... అమ్మగోరా, బేగిరండి, ఏటివ్వమంటారు?'

'ఏదీ ఒద్దు నాయనా, అన్నీ ఇంట్లో వున్నాయి?'

'అలగంతే, నానొల్లకుంతానేటి? పదేళ్ళ కాణ్ణుంచి నాకాడే కొంతన్నారు? ఇయ్యాల కాదంతే నానొల్లకుంతానేటి?!' నాను కూరగాయలు లిత్తన్నాను? నువ్ నాకు డబ్బులిత్తన్నావు; అదంతే నేటి?! దినం దినం మీ గుమ్మం కాడి కొత్తన్నాను; మంచీ సెడ్డా; కష్టం సుఖం సెప్పుకొంతన్నామ్; దాని చంగతేమిటిమరి?! రాచ్చసబజార్లో కొంటే, అయ్యన్నీ దొరుకు తాయేటి?! ఏటమ్మా,

నువ్వలగంతన్నావ్;! సెప్పు, ఏటివ్వమంటావ్?'

'నువ్ చెప్పింది నిజమే; నేను కాదనలేను! నేను ఆ మాటే అందరికీ చెబుతున్నాను. నువ్వూ, నీలాగే ఎందరెందరో గంపెడాశతో గంపలతో మాక్కావాల్సినవన్నీ మా గుమ్మంలోకి తెస్తున్నారు; ఊసూ పలుకూ ఆడుకుంటున్నాం; మంచీచెడ్డా చెప్పుగుంటున్నా. కలిసిమెలసి ఒక కుటుంబంలా బతుకుతున్నాం. వీటినన్నింటినీ రాచ్చసబజార్లు నవిలి మింగేస్తున్నాయ్; ఇంట్లో కూరలు చాలా ఉన్నాయి? ఇప్పుడు నీ దగ్గర కొంటే, కుళ్ళ బెట్టుకోవడమే అవుతుంది! నువ్ మరోలా అనుకోకు; నాకు ఇంట్లో చాలా పనుంది; కూరలగాయలొద్దు!'

'మా వెలగ బతకాల!'

'నువ్ ఓటువేస్తున్నావ్ కదా?!'

'నా వొక్కివోటే కాదు, మా ఊరోళ్ల వోట్లన్నీ నానే ఏయిస్తున్నా!'

'వోట్ల వ్యాపారం కూడా చేస్తున్నావా?'

'అవునమ్మా, నానబిద్దం సెప్పలేను!'

'అదెలాగ చేస్తున్నావ్?'

'ఓ బ్రోకరుగాడున్నాడండి. ఆడొట్టి రగిడీసండి. ఆడంటే అందరికీ బయమేనండి. అదురేనండి. ఆడికాడ నానూ జవకిపోతానండి, ఆడితో నాకు ఇలాకీ వుందండి. ఇలాకీ అంతే ఏటీనేదండి, ఏతంతే, మరేతంతే, అంతేనండి; మరేటీ నేదండి, మతేతంతే, ఆడు వూరోళ్ల పెల్లాలతో తిరుగుతాడండి; ఆడి పెల్లాం నాతో తిరుగుతాదండి; వంతేనండి; మరేటి నేదండి! ఏటంటే, ఆడొచ్చి వూళ్ళో వోట్లు నెక్కేసు గుంటాడండి; ఎన్ని వోట్లంటే అన్ని రోజు వారీ కూలీ నాకిస్తాడండి, నాకు అదనంగా పదేను రోజుల కూలీ ఇత్తాడండి, ఆళ్లని నేను తోలుకెల్లి ఆడుసెప్పి నోడికి వోట్లు ఎయిత్తానండి, వంతేనండి, మరేటినేదండి'.



'మా వెలగ బతకాలని నన్నడుగుతున్నావేంటి? నన్నడిగితే ఏం లాభం? ఆ బ్రోకరుగాణ్నే అడుగు!'

'ఎలక్షన్లు అయిపోనాకా ఆడుమరిక్కనిపిచ్చడండి. ఆడు దొంగనా కొడుకండి. నేబరు కంట్రాక్టరండి ఎలక్సన్లొత్తే, ఆడు వోట్ల కంట్రాక్టరై పోతాడండి. గుండుసూది కన్నబాబు మన ఎమ్మెల్లే అనుకోండి. ఈడు ఆడికాణ్ణుచ్చి నచ్చల మీద నొల్లుకుంతాడండి. మా సేతుల్లో రోజు కూలీ ఎడతాడండి... ఎలక్సను దినాన్న రెండు జీపీలూ, అయిదు రిచ్చాలు నాకెడతాడండి. వంతేనండి, మరేటి నేదండి. ఆడు దొంగనా కొడుకండి, మళ్లీ కనిపిచ్చడండి!'

'ఏటి!? ఆడికాడికెల్లడవే! ఆడు మరీ దొంగనాకొడుకండి! ఆడు మరీ రగిడీసండి! ఆడికాడ కెల్లడవంతే ఏటండి, ఏటనుకుంతన్నారు! పోలీసోడు కాడికెల్లి ఆడి సేతుల్లో పేనాలు ఎట్టడవేనండి? ఆడికాడ ఎప్పుడూ పోలీసులూ, రగిడీసులూ వుంతారండి! ఆడికాడ కెల్లడవంతే ఏటండి?! నాను పెదానమంతిరికి కూడా భయపడనండి! అయితే ఏతంతే పోలీసోడంతే. మాత్తరం పరమబయవండి? ఆ కతంతా ఇప్పుడెందుకులెండి?! ఏటంటే, కన్నబాబుగోడి దగ్గర కెల్లడవంటే, మూడ్రోజుల పని మానేసుకొని ఆడిసుట్టూ ముప్పయిసార్లు తిరగాలండి. ఎప్పుడో దర్శినవిత్తాడండి; 'అయితే, గుండుసూది కన్న బాబన్నావు కదా! ఆయన్నే వెళ్లి అడుగు!' మూడే మూడు సిటాంల మాట్టాడతాడండి; సూత్తానంతాడండి; మరింక అంతేనండి? మళ్లీ దొరకడండి; ఆడికాడికెల్లి ఏటినాపవండి? మూణ్ణాల పనిదండగండి; వంతేనండి, తెల్లారి నెగిసిన కాణ్ణుంచీ ఆడిసుట్టూ పదిపదేను మందిరి గూకుంతారండి; ఒవుడి కొంపముచ్చాల, ఎలగ అక్కరమిచ్చాల, ఇయ్యే కబుర్లండి; ఒవుడి బూవి ఎలగ అక్కరమిచ్చల, దేవుడి బూవి ఎలగ అక్కరమిచ్చాల ఇయ్యే పూసులండి! పద్దు మాలినోణ్ణి నాతో ఆడు మాట్లాడితే ఆడికేటి కలిసొత్తాదండి?!....

'చాలా సేపు మాట్లాడేవు? అరకెజీ వంకాయలిచ్చి వెళ్లు!'

'అంతేనంతారా?!'

'అంతేమరి! అబ్బాయి నిన్ననే రాక్షస బజార్నుండి కొని తెచ్చేశాడు! ఏం చేసుకోవాలి!'

***

'కొబ్బరి నూనె! కొబ్బరి నూనె! ఇప్పుడే ఆడిన నూనె! తాజా తాజా నూనె! అమ్మా. ఎంతివ్వమంటారు?'

## నాకు నచ్చిన కథ



చిల్లర వ్యాపార రంగంలోకి కార్పొరేట్ సంస్థలు, రాక్షసబజార్లు ప్రవేశించి సృష్టిస్తున్న విధ్వంసాన్ని 'అన్నీ ఒకచోటే' కథానికలో చిత్రించడం జరిగింది. ఈ సమస్య మీద వచ్చిన తొలి కథ ఇదేనని కొందరు చెప్పారు. సమస్యను అధ్యయనం చేసి రచించిన కథానిక ఇది. ఆగస్టు 2006 ప్రజా సాహితి మాసపత్రికలో అచ్చయింది. ఎంతమంది ఉన్నా ఎవరి పిల్లలు వారికి నచ్చినట్లే , ఎవరి కథలు వాళ్లకే బాగుంటాయి. కానీ ఎంతోమంది బాగుందని చెప్పబట్టే ఈ కథను పంపడం జరిగింది.

**-జయంతి పాపారావు**

***0891-2557961***

## భోరుమన్న కాజల్

'మొగుడు కొట్టినందుకు కాదు, తోడికోడలు నవ్వినందుకు' అన్నట్టుంది కాజల్ పరిస్థితి. సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌గా కాజల్‌కి ఎంత పేరుందో, హీరోలతో ఉత్తిత్తి లవ్ ఎఫైర్లు పెట్టుకుంటుందన్న ఖ్యాతిని కూడా అంతే మూటకట్టుకుంది. తన గురించి లేనిపోనివి రాస్తున్నారనీ, హీరోలతో కొద్దిగా చనువుగా ఉంటే చాలు వారితో లింకులు కట్టేస్తున్నారంటూ ఇటీవల జరిగిన విలేకర్ల సమావేశంలో విలేకర్ల మీద అంతెత్తున లేచింది. పై పుకార్లన్నీ ఏ పేపర్లో వచ్చాయో చెప్పకుండా ఎగురుతున్న కాజల్‌కు విలేకర్లు ప్రశ్నల మీద ప్రశ్నలు వేసి ఝలక్ ఇచ్చారట! దాంతో తగ్గిన కాజల్, తాను చెప్పినవన్నీ పేపర్లలో వచ్చిన వార్తలు కావనీ, వెబ్‌సైట్‌లో పెట్టి తన పరువు తీస్తున్నారనీ మొసలి కన్నీరు కార్చిందట! పాపం అంత పెద్ద హీరోయిన్ బేలగా కన్నీళ్ళు పెట్టేసరికి సమావేశంలో పాల్గొన్న విలేకర్లు ఏం మాట్లాడలేకపోయారట! అయితే అన్నవన్నీ అని, తాను హీరోలతో లింకు పెట్టుకుంటున్నదీ లేనిదీ మాత్రం తేల్చలేదట!

'నీ కిరాణా కొట్టు ఏమైంది.'

'మూసేసానండి! బేరాల్లేవండి! ఎవరూ మా దగ్గర కొనడం లేదండి! సైకిలు మీద ఇంటింటా తిరుగుతూ కొబ్బరి నూనె అమ్ముతున్నానండి! బత కాలకదండీ, ఎదో వొహటి చేయాలకదండీ; మా కుటుంబం అయిదు తరాల నుండి కిరాణా చిల్లర వ్యాపారమేనండి; ఇప్పుడది పోయిందండి; బతుకు వీధిన పడ్డాదండి; ఏపారవంతా రాచ్చస బజార్లదేనండి! అక్కడ ఇసకేస్తే కిందన రాలనంత జనవండి! మా కొట్లకి ఎవరూ రావడం లేదండి; మూసే సుకున్నావండి. మనకి ఉప్పూ పప్పూ కూడా ఏపారం సేయడం రాదన్నట్టు, అమెరికా కంపెనీవోళ్లే, వాల్‌మార్టోళ్లు మన దేశంలో చిల్లర వ్యాపారం చేస్తార టండి; మన గవన్మెంటు ఆళ్ల కాళ్లట్టుకుని బొట్టు పెట్టి పిలస్తావుందండి? ఇదేంటండి?! మా ప్రజలకి చిల్లర వ్యాపారం కూడా చేత కాదని ప్రపంచానికి చెప్పుకోడవే అవుతోందండి; అంతే కదండి?! ఆళ్లొస్తే మిగతా దుకాణాలు కూడా మూతపడి పోతాయండి! పాలకులకి వాల్‌మార్ట్ వాళ్లేకావాలి కానీ మావక్కర్లేదండి; ప్రజలక్కర్లేదండి; ఎక్కడచూసినా జనం ఏడుస్తున్నారండి, ఏటి సేయాలో ఎవళ్లకీ పాలు పోడంనేదండి!'

'కొబ్బరినూనె ఇంట్లో వుంది బాబూ, వొద్దు! జుత్తుకీ వొంటికీ కొబ్బరి నూనె రాసుకోడం ఎప్పుడో మానేశారు; పాతతరం వాళ్లే ఇంకా వాడుతు న్నారు; దేవుడికి దీపం పెట్టడానికి కొందరు ఆడుతున్నారు! అంతే!

'ఒస్తానమ్మా!'

'ఒక అరలీటరు ఇచ్చి వెళ్లు, దేవుడి దీపానికి వాడుతాన్లే! మీకు వ్యాపార సంఘాలున్నాయ్; పెద్దపెద్ద పారిశ్రామికవేత్తల సంఘాలున్నాయ్; పెద్ద పెద్ద వాణిజ్యవేత్తల సంఘాలున్నాయ్; వాళ్లేమి చేస్తున్నారు?! వాళ్లెందుకు న్నట్టు?!'

'నా కంతలా తెలీదు కానీ అందరూ ఓమాట చెప్పుగుంటున్నారు; అందులో కొందర్ని ప్రభుత్వమే కొనేసిందంటండి! మిగిలిన వాళ్ళను రాచ్చస బజార్లే కొనేసాయటండి!'

***

'చీరలండి చీరలు... వెంకటగిరి... ఉప్పాడ, గద్వాల.... పోచంపల్లి... కంచి చీరలండి... కొత్త కొత్త డిజైన్ల కాటన్ చీరలండి... అమ్మగారూ, చూస్తారా?'

'ఏంటి!' నువ్వా?! ఇలా ఇంటింటా తిరుగుతూ చీరలమ్మడవేంటి?! ఎంతో పేరున్న బట్టలషాపు మీది! ఏమైంది?!'

'బేరాలు లేవండి... మూసేసానండి... ఎన్నోతరాల నుండి మాది ఇదే వ్యాపారమండి... ఇది తప్ప మరో పని ఏదీ మాకు రాదండి... ఏం చేస్తా వండి; కూలిపనికి వెళ్లలేవండి! నామోషీ అండి! కూలైనా గిట్టితే చాలని బట్టలే అమ్ముతున్నానండి... కూలీ కూడ గిట్టడం లేదండి... ఏం చేయాలో తెలీక ఈ పనే చేస్తున్నానండి... ఇంత నాణ్యమైన చీరలు మీకు ఇంత చవగ్గా ఏ షాపులోనూ దొరకవండి... చీరలు చూస్తారా?'

'ఒద్దు, బాబు, ఒద్దు! నిన్ననే మా కోడళ్లు చీరలు కొనేశారు... బంగారు గొలుసు లాటరీలో దొరుకుతుందని ఓ రాక్షస షాపులో కొనేసారు!'

'ఎంటోనమ్మా! అంతా చిత్రంగా వుంది! నా కళ్లను నేను నమ్మలేక పోతు న్నాను... ఏం జరుగుతుందో ఎందుకిలా జరుగుతోందో ఏవీ తెలీడం లేదమ్మా.... పాలకులేమో అభివృద్ధి, అభివృద్ధి అంటున్నారు! చిన్న జనం మాత్రం ఎక్కడ చూసిన కూలీలుగా మారిపోతున్నారు! చిన్న రైతులు కూలీ లుగా మారిపోతున్నారు... చిల్లర వ్యాపారస్తులు కూలీలుగా మారి పోతు న్నారు... చిన్నపరిశ్రమలు మూతపడిపోతున్నాయ్.... స్వతంత్ర జీవనవి ధానం పోయి, ప్రజలు కూలీలుగా బానిసలుగా మారి పోతున్నారు... అన్నింటికీ యంత్రాలు వచ్చేసి కూలి పని కూడా దొరక్కుండా పోతున్నారు! ఏం జరుగుతోందో ఏమీ తెలీడం లేదమ్మా! ? రాక్షసులే కాని చిన్న జనం మరింక బతకలేరేమో! వెళ్లొస్తానమ్మా!'

'మంచిది బాబూ!'

***


ఈడు... జోడు ... అందం... ఐశ్వర్యం
కళ్యాణం ... కాకతీయ!

కాకతీయ మ్యారేజస్ ప్రై. లిమిటెడ్.
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక,
అమీర్‌పేట, హైదరాబాద్. 500 073.
ఫోన్స్: 040-23747777 , 9391999999



FREE online Registration &
Free search
www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com

| | |
|---|---|
| అమీర్‌పేట్ | నెల్లూరు |
| కూకట్‌పల్లి | తిరుపతి |
| దిల్‌షుఖ్‌నగర్ | కర్నూలు |
| విజయవాడ | (చెన్నయ్) టి.నగర్ |
| గుంటూరు | బెంగుళూర్ |
| తెనాలి | సేలం |
| విశాఖపట్నం | మధురై |
| రాజమండ్రి | వెల్లూరు |
| కాకినాడ | తిరుచి |
| ఖమ్మం | పాండిచ్చేరి |
| ఒంగోలు | ఈరోడ్ |
| | ఏలూరు |

చెన్నయ్ (అన్నానగర్), చెన్నయ్ (పోరూర్), (చెన్నయ్) తాంబరం, జయానగర్, కోయంబత్తూరు.


''ఏవండీ! మా మాటలన్నీ వింటున్నారా, నిద్రపోతున్నారా?! ఉద్యోగం చేసినంతకాలం ఉద్యోగాన్ని ప్రేమించారు. పదవీ విరమణ చేశాక నిద్రను ప్రేమిస్తున్నారు! మీరు నన్ను ఎప్పుడూ ప్రేమించలేదు!'

'అవును'

'మన నగరంలో రోజుకి కనీసం పదివేల మంది నాలుగైదు రాక్షస బజా ర్లలో కొనుగోళ్లు చేస్తున్నారట! మన నగరంలోని కొనుగోలుదార్ల సొమ్మంతా ఇది వరకు వేల మంది చేతుల్లోకి వెళుతూ వుండేది. ఇప్పుడా సొమ్మంతా నాలుగైదు రాక్షస షాపుల్లోకి మాత్రమే వెళ్లిపోతోంది! అంతే కదండి?!'

'అవును!'

'అమెరికా వాల్‌మార్ట్ వంటి రాక్షస బజార్లు వచ్చేస్తే, ఇప్పుడు నాలు గైదు రాక్షస షాపుల్లోకి వెళ్తున్న సొమ్ములోని ఎక్కువ భాగం వాల్‌మార్ట్‌ల్లోకే వెళ్లిపోతుంది! అంతేకదండి?!'

'అవును'

'నలుగురైదుగురి బకాసురుల బాగుకోసం ఎందరో బలైపోతున్నారు. మల్లెతీగల్లా అల్లుకుని పుష్పించి పరిమళిస్తున్న మానవ సంబంధాలు మంట కలిసిపోతున్నాయ్! అంతే కదండీ?!'

'అంతేకాదు, ప్రజలు ఉద్యమించి అడ్డుకోకపోతే, ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కోల్పోతారు! మనుషుల మధ్య యాంత్రిక సంబంధాలే కానీ మానవీయ మానవ సంబంధాలుండవు!'.

❋

–ప్రజాసాహితి – మాసపత్రిక ఆగస్టు ***2006***